క్లుప్తంగా

హుండీ కానుకల లెక్కింపు

నల్లచెరువు: ప్రసిద్ధి చెందిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ ఈఓ మురళీ కృష్ణ బుధవారం తెలిపారు. కానుకల ద్వారా రూ.2.85 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు నాగరాజుతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి నుంచి ఇతర మండలాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను చెన్నేకొత్తపల్లి మండల శాఖ పీఆర్‌టీయూ నాయకులు బుధవారం సన్మానించారు. 12 మంది ఉపాధ్యాయులను పూలమాలతో సన్మానించి, వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సాయినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి భూషణ, వన్నారామిరెడ్డి, రామాంజనేయులు ఇతర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కార్పెంటర్ మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లమాడ: ఎద్దులవాండ్లపల్లికి చెందిన కార్పెంటర్ కదినిగారి అక్కులప్ప(40) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొరకల రమణ, నాయకులు, నాగరాజునాయుడు, నరసింహులు, సతీష్‌యాదవ్ బుధవారం ఉదయం అక్కులప్ప మృతదేహాన్ని సందర్శించి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

తనకల్లు: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. గీతాలవారిపల్లికి చెందిన చంద్రమ్మ అనే వృద్ధురాలు బుధవారం వ్యక్తిగత పనిమీద కొక్కంటిక్రాస్‌కు వచ్చింది. ఆ సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వందేమాతరం టీం సభ్యులు గమనించి తమ ఉచిత అంబులెన్స్‌లో చంద్రమ్మను తనకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కందుల పంపిణీ

కనగానపల్లి: ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం (నేషనల్ ఫార్మ్ సీడ్ మిషనరీ) పథకం కింద రైతులకు వంద శాతం సబ్సిడీపై ఉచితంగా విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ మాధురి తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి కందుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అవసరం



మొక్కలు నాటుతున్న విదేశీ భక్తులు

పుట్టపర్తి టౌన్: భావితరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కల పెంపకం చాలా అవసరమని గల్ఫ్ దేశాలకు చెందిన సత్యసాయి భక్తులు అన్నారు. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి సేవాదల్ జోన్-8 గల్ఫ్ దేశాల భక్తులు చివరి రోజు కొత్తచెరువులోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో 108 మొక్కలు నాటారు. ఇందులో వేప, మామిడి, టెంకాయ మొక్కలు ఉన్నాయి.

వేధింపుల కేసు నమోదు

కదిరి టౌన్: అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారంటూ కదిరిలోని అడపాల వీధికి చెందిన సింధూలత ఫిర్యాదు మేరకు భర్త ధనుంజయరెడ్డి, ఆయన కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సింధూలతకు 2013లో కడపకు చెందిన ధనుంజయరెడ్డితో వివాహమైంది. పెళ్లి సమయంలో 15 తులాల బంగారు నగలను ఇచ్చారు. కొన్నేళ్లు వీరి కాపురం సజావుగా సాగింది. ఓ కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో ధనుంజయరెడ్డి తాగుడుకు బానిసై కొన్ని రోజులుగా అదనపు కట్నం కోసం వేధిస్తూ వస్తున్నాడు. తన భర్త చిన్నాన్న నాగమణీంద్రరెడ్డి, చిన్నమ్మ నాగలక్ష్మి ప్రోద్బలంతో వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో తట్టుకోలేక సింధూలత పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు వేధింపుల కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆడబిడ్డకు అన్యాయం

- ఇంతకంటే పచ్చి మోసం ఏమైనా ఉందా?
- హామీల అమలుకు రాష్ట్రాన్ని అమ్మాలా..!
- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్



మరువతండాలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైన ఆడబిడ్డ నిధి పథకం అమలు చేయకుండా ఆడబిడ్డలకు అన్యాయం చేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ధ్వజమెత్తారు. బుధవారం కదిరి మండలం మరువతండాలో పార్టీ కదిరి మండల కన్వీనర్ మణికంఠనాయక్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' పోస్టర్లను సమన్వయకర్త ఆవిష్కరించారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మహిళల సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌తో స్కాన్ చేసి ప్రదర్శించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేసి.. ఆ సమయాల్లో ఠంచన్‌గా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేవారని మహిళలు సమన్వయకర్త ఎదుట గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. ఇంతవరకు రైతు భరోసా పథకం ఊసే లేదన్నారు. తల్లికి వందనం పథకం అమలులో అనేక కొర్రీలు వేసి లబ్ధిదారుల సంఖ్య భారీగా కుదించేశారన్నారు. భూమి ఎక్కువ ఉందని, విద్యుత్ వినియోగం పరిమితికి మించి వాడారని తదితర సాకులతో పథకం అందకుండా చేశారన్నారు. ఓటర్లను ఆకర్షించడం కోసమే కూటమి పార్టీల నేతలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారని, వారికి ఆ పథకాలు అమలు చేయాలన్న ఉద్దేశమూ ఏ కోశానా కనిపించడం లేదని అర్థమవుతోందన్నారు. వంచనకు గురైన ప్రజలు మళ్లీ ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిన పాలకులు తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నిండి 59 ఏళ్లలోపు వయసున్న మహిళలకు నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్నాయుడు సిగ్గు లేకుండా చెప్పడం ప్రజలను నిలువునా మోసం చేయడమే అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంద్ నాయక్, సర్పంచ్‌లు రజనీష్‌రెడ్డి, రాఘవ, నారాయణనాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జైనుల్లా, క్రిష్ణానాయక్, గోవర్ధన్‌రెడ్డి, బాబ్జాన్, పవన్‌కుమార్, హనుమంతరెడ్డి, వెంకటేష్‌నాయక్, ఎహసాన్, మహబూబ్‌బాషా, గోబీబాయి, కవితబాయి, రమణమ్మ బాయి, మమతాబాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి 'మల్లెతీగ' పురస్కారం



అవార్డు అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

ధర్మవరం రూరల్: విజయవాడలో బుధవారం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనంలో ధర్మవరం యువకవి పి.రామకృష్ణారెడ్డికి మల్లెతీగ వారి ఆత్మీయ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అందుకున్నారు. తాను రచించిన 'నీ పేరే రాస్తాను స్వాతంత్ర్యమా!' అనే కవితా గానానికి గుర్తింపుగా ఈ పురస్కారం వరించినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మల్లెతీగ ఫౌండేషన్, మల్లెతీగ మాస పత్రిక సంపాదకులు కలిమిశ్రీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

చీకిరేవులపల్లిలో పీ4పై గ్రామసభ

అమడగూరు: చీకిరేవులపల్లి సచివాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు పీ4 కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రామనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలన చేయడానికి ప్రభుత్వం ఈ పీ4 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ చంద్ర, వీఆర్‌ఓ మహేంద్ర ప్రసాద్, సర్పంచ్ సురేంద్రరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బుధవారం పీర్లు జలధికి తరలివెళ్లాయి. మంగళవారం రాత్రి అగ్నిగుండంలోకి పెద్ద కట్టెలను వేసి వెలిగించారు. తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. బుధవారం సాయంత్రం పీర్లను పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, డప్పుచప్పుళ్ల మధ్య పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. పలువురు భక్తులు పీర్లకు చక్కెర చదివింపులు చేయించారు. ఊరేగింపులో యువత, చిన్నారులు డప్పు వాయిద్యాలకు అలావ్ తొక్కారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ప్రజాస్వామ్య విలువలపై అవగాహన



మాక్ ఎన్నికల్లో ఓటు వేస్తున్న విద్యార్థులు

ధర్మవరం అర్బన్: మాక్ ఎన్నికల ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించినట్లు కాకతీయ విద్యానికేతన్ హైస్కూల్ కరస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో బుధవారం విద్యార్థులతో 'మాక్' ఎన్నికలు నిర్వహించారు. స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్), అసిస్టెంట్ స్కూల్ పీపుల్ లీడర్ (ఏఎస్‌పీఎల్) పదవుల కోసం పోటీపడ్డారు. ఎన్నికల హోరాహోరీని తలపించేలా ఓటర్లు, ఏజెంట్లు, బ్యాలెట్ బాక్సులు, ఓటింగ్ పోలింగ్ స్టేషన్ ఇలా ప్రతి అంశం వాస్తవ ఎన్నికలను నిర్వహించే విధానంలో తీర్చిదిద్దారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులలో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొంది, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన నిర్ణయాలు తీసుకునే శక్తి పెంపొందుతాయని పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, శెట్టిపి పద్మలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందించండి



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: మహిమాన్విత ఓబులేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి కోరారు. బుధవారం ఆలయ కమిటీ సమావేశం పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో అధ్యక్షుడి ఇంటిలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీల్లో తొలి ఏకాదశి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు. వచ్చిన విరాళాలతో పాటు హామీలు ఇచ్చిన వాటిపై దృష్టి సారించి ఆలయ అభివృద్ధికి తోడ్పాటు నందించాలన్నారు. ఇక కొండపై స్వామి వరకు పక్కా రోడ్డు, కల్యాణమండపం, కొండపై నీటి ట్యాంకు నిర్మాణం, పైపుల క్రమబద్ధీకరణ, మరుగుదొడ్లు, కొండ కింది భాగం విస్తరణ తదితర నిర్మాణ పనులు పూర్తి చేయాలని కమిటీ సమావేశంలో చర్చించారు. పలు తీర్మానాలను ఆమోదించారు. విరాళాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి ఉమాపతి, కార్యనిర్వాహక సభ్యులు రామచంద్రారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ రమాదేవి



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

ధర్మవరం రూరల్: గ్రామాలను అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేద్దామని ఎంపీపీ గిరక రమాదేవి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతు గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులను అధికారులు తప్పక ఆహ్వానించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులకు సంబంధించి సర్పంచ్‌ల తీర్మానాలను తప్పక తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ సాయి మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాప్తి చెందించే అవకాశాలు ఉన్నాయన్నారు. పారిశుద్ధ్య పనులతో పాటు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీటి పైపులు లీకేజీ కాకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించాలన్నారు. వ్యవసాయాధికారి ముస్తఫా మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈసారి సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం కందులను సబ్సిడీ ధరతో పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ మలేరియా, టీబీ తదితర వాటి పట్ల గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాగా మండలస్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కాగా పలు శాఖల అధికారులు సమావేశానికి గైర్హాజరు అయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

కదిరి అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఐక్య ఉపాధ్యాయ సంఘం (యూటీఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో వారు ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 12వ పీఆర్‌సీ 2023 జులై 1 నుంచి అమలు చేయాలన్నారు. 2023 డీఎస్సీ ఉపాధ్యాయులకు మెమో నంబర్ 57 అమలు చేయాలన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ పెన్షన్ రీస్టోర్ చేయాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, తాహిర్‌వలి, ఆజంబాషా, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గాండ్లపెంట: కేజీబీవీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఎస్‌ఓ దుర్గకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాబా ఫక్రుద్దీన్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన కేజీబీవీని సందర్శించి, తరగతి గదులతో పాటు వంట గది, కూరగాయలు, వండిన ఆహారం, తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పరిసరాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారితో పాటు ఆరోగ్య పర్యవేక్షకులు ఉపేంద్రారెడ్డి, విజయకుమారి, హెచ్ఈ విజయ్‌కుమార్, సీహెచ్ఓ రష్మీ, ఏఎన్ఎం పేక్షీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం సీజ్

ముదిగుబ్బ: ముదిగుబ్బ నుంచి దొరిగిల్లు వైపు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని సీఐ శివరాముడు సీజ్ చేశారు. అనంతరం కదిరి ఎంవీఐ కార్యాలయ అధికారులకు అప్పగించారు. బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం రూరల్: మండలంలోని నాగలూరు వద్ద పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 36,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగుల సేవలు ఎనలేనివి



ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: ఉప్పలపాడు గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను బుధవారం సర్పంచ్ లక్ష్మీనారాయణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీఏ ఓబిరెడ్డి, నాగేంద్రరెడ్డి,రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి సన్మానం



ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

ముదిగుబ్బ: చిన్నకోట్ల పాఠశాల ఉపాధ్యాయుడు అంజన్‌రెడ్డి నార్పల మండలం బి.పప్పూరుకు బదిలీ అయ్యారు. బుధవారం ఆయన్ను గ్రామస్తులు పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల పరస్పర దాడులు

కదిరి టౌన్: పట్టణంలోని రాయచోటి రోడ్డులో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న షేక్ షాకీర్, జీవిమాను సర్కిల్, పీవీఆర్ బార్ దగ్గర చికెన్ పకోడా బండ్లు పెట్టుకునే నాజీర్‌ఖాన్ ఇద్దరు డబ్బు విషయంగా బుధవారం గొడవపడి పరస్పరం దాడులు చేసుకున్నారు. షాకీర్ వద్ద కొన్ని రోజులుగా నాజీర్‌ఖాన్, అతని కుమారుడు అహ్మద్‌ఖాన్ రూ.3 లక్షల విలువ చేసే చికెన్ అప్పుగా తీసుకుని రూ.70 వేలు బకాయి పడ్డారు. బకాయి సొమ్ము చెల్లించాలని అడిగినందుకు వాగ్వాదం చోటు చేసుకుని ఇరువర్గాల దాడి చేసుకొని గాయపడ్డారు. ఘటనపై పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నాయకునిపై ఫిర్యాదు

ఓడీచెరువు(పుట్టపర్తి అర్బన్): ఓడీచెరువు మండల టీడీపీ నాయకుడు పీట్ల సుధాకర్‌పై జర్నలిస్టులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వార్తల విషయంలో జర్నలిస్టును అసభ్య పదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన టీడీపీ నేతపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ రమేష్ నాయక్‌ను కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జర్నలిస్టులు భుజంగరావు, బాబాఫక్రుద్దీన్, రంగప్ప, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మణ్ణ, మహబూబ్ బాషా, మౌలాలి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేశ్వరీ దేవి జయంతి

కదిరి టౌన్: ఆషాఢ అమావాస్యను పురస్కరించుకొని గురువారం మున్సిపల్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి చౌడేశ్వరి ఆలయంలో చౌడేశ్వరీదేవి జయంతి మహోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఊయలోత్సవం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరణకు పోస్టుకార్డుల ఉద్యమం



తాడిమర్రిలో పోస్టు కార్డులతో ర్యాలీ

తాడిమర్రి: ఉమ్మడి జిల్లాలో పేదల అభ్యున్నతి కోసం పని చేస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని కోరుతూ విద్యార్థులు బుధవారం పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. తాడిమర్రి, నిడిగల్లు ఆర్డీటీ పాఠశాలల ఉపాధ్యాయులు సాకే రామకృష్ణ, నిడిగల్లు సుదర్శనం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆర్డీటీకి విదేశాల నుంచి యథావిధిగా ఫండ్ వచ్చేలా వెసులుబాటు కల్పించాలని ప్రధాన మంత్రికి ఉత్తరాలు రాశారు. అనంతరం తపాలా కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతాప్, ఆర్డీటీ సీబీటీ కుళ్లాయప్ప, సీడీసీ నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

చెన్నేకొత్తపల్లి: ఆర్డీటీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పోస్టు కార్డులు రాశారు. ఆర్డీడీని కాపాడుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ పోస్టుకార్డులను ఢిల్లీకి పంపుతామని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పుట్టపర్తి టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏపీపీటీడీ జైభీమ్ అసోసియేషన్ కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తిలోని అబ్దుల్ షాదీమహల్ ఫంక్షన్ హాలులో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జైభీమ్ అసోసియేషన్‌పై ఎన్ఎంయూ నాయకత్వం చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. పుట్టపర్తి డిపోలో ఈ నెల 18న డ్రైవర్, కండక్టర్ల ఫిక్స్‌డ్ చార్ట్ కౌన్సిల్‌లో జైభీమ్ అసోసియేషన్ పాల్గొనడంతో ఎన్ఎంయూ విపక్ష ప్రదర్శించి కౌన్సిల్ నుంచి బహిష్కరించదని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాబన్న, గంగాద్రి, జోనల్ నాయకులు రమణప్ప, మత్యాలప్ప, జిల్లా నాయకులు ఎస్‌సీకె నాయక్, బాబయ్య, ఆర్‌జీ నాయర్, ఆదెన్న, డీహెచ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న బబ్లూ గంగూలి

చెన్నేకొత్తపల్లి: భూమి లేని నిరుపేదల అభివృద్ధే గ్రామసిరి సొసైటీ లక్ష్యమని టింబక్టు కలెక్టివ్ సంస్థ వ్యవస్థాపకులు మేరి వటమట్టమ్, బబ్లూ గంగూలి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో బుధవారం 15వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, చిన్నజీవాల పెంపకందారులతో పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి వారికి సొసైటీ ద్వారా అప్పులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జీవాల పెంపకం, పశుపోషణపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, రొద్దం, పెనుకొండ మండలాల్లోని 60 గ్రామాల్లో 98 సంఘాలు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, సుకన్య, శ్రీకాంత్, లక్ష్మీనరసమ్మ, తిరుమల దేవి, రమేష్, మధు, మమత, కుళ్లాయప్ప, ఆంజనేయులు, 4 మండలాల్లోని చిన్నజీవాల పెంపకం దారుల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చర్యలు



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ధర్మవరం రూరల్: మద్యం మత్తులో నడిపితే చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం రాత్రి గొట్లూరులో ఆటోలు, బొలెరో వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌తో పాటు వాహన రికార్డులను కలిగి ఉండాలన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలన్నారు.

స్నానపు గదులు, మరుగుదొడ్ల సమస్య తీర్చండి



వసతి గృహంలో విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ బాలక్రిష్ణుడు

చెన్నేకొత్తపల్లి: వసతి గృహంలో స్నానాల, మరుగుదొడ్ల గదులు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఏకరువు పెట్టారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలుర వసతి గృహాలను ఎంపీడీఓ బాలకృష్ణుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ బాలుర వసతి గృహంలో వంద మంది వరకు విద్యార్థులు ఉన్నా సరిపడు స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవని విద్యార్థులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. కొన్ని మరుగుదొడ్లు బ్లాక్ అయ్యాయని తెలిపారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.